వర్షాకాలం వ్యాధుల గాలం


పెనుగొండలో ఇంటింటి సర్వేలో సూచనలుచేస్తున్న వైద్యాధికారి షేక్ షవీద్


వడలిలో నీరు నిలిచిన చోట్ల మందు జల్లిస్తున్న సిబ్బంది


రుబ్బురోళ్లలోనూ నీరు నిలువ ఉండకూడదని సూచిస్తున్న సిబ్బంది

- విజృంభిస్తున్న అంటు వ్యాధులు
- అప్రమత్తతే ఆయుధమంటున్న వైద్యులు

పెనుగొండ: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలంటూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో ఆరోగ్య సూత్రాలు పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చునని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షించుకోవడానికి ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తూ సూచనలు చేస్తున్నారు. వర్షాలతో నీటి నిలువల వల్ల దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని వివరిస్తున్నారు. వీటి కొద్దిపాటి శ్రద్ధ తీసుకుంటే సరిపోతుందన్నారు. వర్షాకాలంలో వర్షపు నీరుతో పాటు, మురుగు నీరు రోడ్లపైనా పారి, కాలువల్లో చేరడంతో పాటు తాగునీటి పంపుల్లోకి రావడంతో కలుషితమవుతాయన్నారు. దీని వల్ల ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

దోమల వ్యాప్తితోనే రోగాలు

నీరు నిలువ ఉండడం వల్ల దోమల వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. అందువల్ల కచ్చితంగా కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచిస్తుననారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల విషయంలో ఎక్కువగా శ్రద్ధ చూపించాలని కోరుతున్నారు. నిల్వ ఉంచిన వంటకాలను తినడం, అధికంగా మాంసాహారం భుజించడం, రోడ్ల వెంబడి ఏ మాత్రం రక్షణలేని తినుబండారాలు తినడం వల్ల డయేరియా సోకే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ వ్యాధి సోకితే అధికంగా నీళ్ల విరేచనాలు, వాంతులు, కడుపులో నొప్పి, జ్వరం, నీరసం, ఆకలి లేకపోవడం, కడుపు ఉబ్బరంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అధిక జ్వరం, చలి, ఆకలి మందగించడం, వాంతులు, భరించలేని తలనొప్పి, కీళ్ల నొప్పులు, నీరసం డెంగీకి లక్షణాలు, వ్యాధి తీవ్రమైతే చర్మంపై దద్దుర్లు, బ్లీడింగ్ అవడం, బీపీ తగ్గిపోవడం, ప్లేట్‌లెట్స్ పడిపోవడం వంటి లక్షణాలు డెంగీకి ఉంటాయి. ఏ మాత్రం అనుమానం వచ్చిన వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్య సూత్రాలు, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఆరోగ్య సూత్రాలు, పరిసరాలు పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వాటర్ డ్రమ్స్, రుబ్బురోలు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, పాత డబ్బాలు, కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు ఇంటి నుంచి బయట పాడేయాలి. వీటిలో నీటి నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తి అరికట్టవచ్చు. రోగాలు సోకకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

– షేక్ షవీద్, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మార్టేరు

క్లుప్తంగా

వైభవంగా వారాహి నవరాత్రులు


మొల్లపర్రు అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని మొల్లపర్రు కనకదుర్గ బీచ్‌లో ఉన్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో వారాహి నవరాత్రుల వైభవంగా సాగుతున్నాయి. ఎనిమిదోవ రోజు ఆదివారం అమ్మవారి సన్నిధిలో నక్షత్ర దోషాలు, కార్యసిద్ధి దుష్టగ్రహ నివారణకు విశేషార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించే పూజా కార్యక్రమంలో తీర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యలమంచిలిలో వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు చిత్రంలో వైద్య శిబిర నిర్వాహకులు

యలమంచిలి: స్థానిక పుంతల ముసలమ్మ కాపు కల్యాణ మండపంలో ఆదివారం పాలకొల్లు పట్టణ వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఎండీ డాక్టర్ కార్తీక్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నారిన హర్ష, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ దుర్గాప్రసాద్‌లు సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిర నిర్వహణకు సర్పంచ్ బల్రే మేరీ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు చిలుకూరి రాజ్యలక్ష్మీ శ్రీనివాస్ గ్రామ పెద్దలు కొడవటి ఫణి, చివటపు నాగేశ్వరరావు, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ (బుజ్జి), వెలిచేటి నరసింహవర్మ, బొప్పన హరికిషోర్, తాళ్లూరి శ్రీనివాస చక్రవర్తి, తాడి శేఖర్, కొడవటి వీర వెంకట సత్యనారాయణ, కాసా చిట్టిబాబు, కాసా కిషోర్, కాసా గణేష్, కొడవటి శ్రీరామకృష్ణ, తమ్మినీడి శ్రీను తదితరులు సహకారం అందించారు.

ఉచిత ధ్యాన శిక్షణ


ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: స్థానిక శ్రీ సీతారామస్వామి దేవస్థానం ప్రాంగణంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శిక్షకులు అడుసుమిల్లి వాణిశ్రీ వెంకటరత్నం (విజయవాడ) దంపతులు పాల్గొని జ్ఞాన బోధ చేశారు. ధ్యానంతోనే జ్ఞానం–జ్ఞానంతోనే ముక్తి అన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ బుద్ధుడు ప్రబోధించిన పంచశీలాలు వివరించారు. కార్యక్రమంలో మేడిశెట్టి కృష్ణారావు, తీడ నాగరాజు. ఎస్.ఉదయ్ కుమార్ కె.మోహన్ కుమార్ అల్లు అప్పారావు, ఎస్.కమల,జామి పైడమ్మ, వర్రి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

బిషప్ పరదేశిబాబు దంపతులకు సత్కారం

భీమవరం : ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ చర్చి (ఏఈఎల్‌సీ) అధ్యక్షుడు మోడరన్ బిషప్ కేఎఫ్ పరదేశిబాబు దంపతులను భీమవరం బేతనిపేట చర్చిలో సత్కరించారు. బిషప్ పరదేశిబాబు మాట్లాడుతూ లూథరన్ సంఘాల క్రైస్తవులు ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.వర్గీస్ దానియేలు, పట్టా దేవరాజ్, పీడీ విల్సన్, పాస్టర్ ఎస్.పుష్పరాజ్, గంటా సుందర్ కుమార్, పి.సుదర్శన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి


మొక్కలు నాటుతున్న దృశ్యం

భీమవరం : మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి, అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్ సీహెచ్ భానుమణి, ఎం.శ్యామల అన్నారు. వెనుకబడిన బాలికల వసతి గృహంలో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలను నాటడం కాదు వాటిని సంరక్షించాలని సూచించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇటువంటి చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని, వసతి గృహంలో వివిధ రకాల 36 మొక్కలను నాటమన్నారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, అరసవల్లి సుబ్రమణ్యం, నరహరిశెట్టి కృష్ణ, ఎస్కే చాన్ భాషా పాల్గొన్నారు.

పక్షవాత రోగికి మందుల అందజేత


పాలకొల్లు పట్టణంలో పక్షవాత రోగికి మందులు అందజేస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 15వ వార్డుకి చెందిన ఉల్లి కృష్ణవేణి పక్షవాతంతో బాధపడుతోంది. ఆమెకు మందులు కొనుక్కోవడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వాకర్స్ క్లబ్ సభ్యుల దృష్టికి తీసుకురావడంతో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు రూ.7వేలు విలువైన మందులను ఆదివారం కృష్ణవేణికి అందజేశారు. క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, నంబూరి గంగాపవన్, బొలిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

కొండ చిలువ హతం



ఆకివీడు: స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని బంగారు కోడు పంట కాలువ తవ్వకం పనుల్లో భారీ కొండ చిలువ బయటపడింది. సుమారు 14 అడుగుల పొడవున్న కొండ చిలువ ప్రొక్లెయిన్ దెబ్బకు చనిపోయింది. చెరువుల ప్రాంతంలో తిరుగుతూ రొయ్యలు, చేపలను వేటాడి తింటుందని స్థానికులు చెబుతున్నారు. వెంకయ్య వయ్యేరు పంట కాలువ నుంచి ఓల్డ్ వయ్యేరు కాలువ గుండా ఈ ప్రాంతానికి వచ్చి ఉండొచ్చని చెబుతున్నారు.

నారుమడుల్లో చేరిన నీటిని తొలగించాలి


లక్ష్మణేశ్వరం గ్రామంలో ముంపునకు గురైన సార్వా నారుమడి

మొగల్తూరు: నారుమడుల్లో చేరిన నీరు చేరిన రైతులు ఆందోళ చెందకుండా వాటి తొలగిస్తే సరిపోతుందని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. నారుమడులు చుట్టూ గట్లు ఎత్తుగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మడుల్లో వర్షపు నీటిని తొలగించి నారుపై రెండు గ్రాములు కార్బడిజమ్ 2గ్రాములు మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మండలంలో సుమారు 980 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అంచనావేస్తున్నామని, ఇప్పటి వరుకు కేవలం 70 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారని స్పష్టం చేశారు. నారుమడులు వేయడం ఆలస్యమైనా లేదా సాగు పనులు చేపట్టడం ఆలస్యమైనా ఇప్పటి వరుకు నారుమడులు వేయని రైతులు వెదజల్లే పద్ధతిని పాటించాలని సూచించారు. వెదజల్లే పద్ధతికి ఎకరాకు 12 నుంచి 15 కేజీల విత్తనాలు సరిపోతాయని వివరించారు. విత్తనాలు జల్లినతరువాత నారుమడుల్లో నీరు నీలువలేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఒక ఎకరం పొలంలో వరి నాట్లు వేయాలంటే 5 సెంట్లలో వేసిన నారుమడి సరిపోతుందని వివరించారు. నారుమడులకు రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన నారు పెరగాలంటే 1 నుండి 2 కేజీల పొటాష్ వేస్తే సరిపోతుందని తెలిపారు.

వర్షంతో సార్వారైతు అతలాకుతలం

నరసాపురం రూరల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు డ్రెయిన్‌లు మురుగు నీటిని లాగకపోవడంతో మండలంలో పలుచోట్ల నారుమడులు ముంపు బారినపడ్డాయి. లక్ష్మణేశ్వరంలో ముంపు నీరు లాగకపోవడంతో ఇటీవలే వేసిన సార్వా నారుమడులు నీట మునిగాయి. లక్ష్మణేశ్వరం ముగురునీటి కాలువ ప్రక్షాళన చేపట్టకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి పంటచేలల్లోకి నీరు ఎగదన్నుతుంది. దీంతో నారుమడిలో అధికంగా ఉన్న నీటిని బయటకు తోడినా ఫలితం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. దాళ్వా పంటను అమ్మిన డబ్బు చేతికి సకాలంలో అందక పోవడం, వర్షాలు సమయానికి కురవకపోవడం తదితర కారణాలతో రైతులు నారుమడులు వేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తీరా నారుమడులు పోసిన సమయంలో వర్షాలు కురుస్తుండటంతో పనులు ముమ్మరంగా ప్రారంభమైనప్పటికీ అధిక వర్షాలు పడుతుండడం, మరోవైపు ముంపు నీరు లాగకపోవడంతో పల్లపు ప్రాంతాల్లో పనులకు ఆటంకం కలగుతుంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కొంతమంది రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నప్పటికీ లోతట్టు ప్రాంతాల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.


మొగల్తూరులో వేసిన నారుమడుల్లో చేరిన వర్షపునీరు


నారుమడిలోకి చేరిన వర్షపు నీటిని తోడుతున్న రైతు

నరసాపురంలో పొంగుతున్న డ్రెయిన్లు

- పట్టణంలో అధ్వానంగా పారిశుధ్యం
- తూతూ మంత్రపు పనులతో ఇబ్బందులు


నరసాపురం పట్టణంలోని ఒకటో వార్డులో డ్రెయినేజీ పరిస్థితి


మోర్ మార్కెట్ వద్ద రోడ్డు మురుగు నీరు చేరిన దృశ్యం


బస్టాండ్ వద్ద అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

నరసాపురం: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నరసాపురం పట్టణంలో డ్రెయిన్లు పొంగుతున్నాయి. దీంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది.ముఖ్యంగా డ్రెయిన్స్‌ను బాగు చేయడంలో ఇటీవల మున్సిపల్ అధికారులు శ్రద్ధ పెట్టడంలేదు. వేసవి కాలంలో ప్రధాన డ్రెయిన్లల్లో సిల్ట్ తీసే పనులను అధికారులు నిర్వహించారు. అయితే పనులు తూతూమంత్రంగా చేయడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం పట్టణంలో చాలా చోట్ల డ్రెయినేజీల్లో మురుగుపారడంలేదు. దీనికి తోడు వర్షాలు కురుస్తుండడంతో ఇబ్బందులు మరిన్ని ఎక్కువయ్యాయి. డ్రెయినేజీల ద్వారా నీరు పారక రోడ్డు మీదకు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. డ్రెయినేజీల్లో తీసి సిల్ట్ కూడా అక్కడే వదిలేయడంతో పరిస్థితి మరింత దిగజారింది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో డ్రెయినేజీల పరిస్థితిపై అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా షోడశి మహోత్సవం


పెనుగొండ వాసవీ శాంతి ధాంలో షోడశి పూజా మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద పురి స్వామిజీ శివైక్యం చెందడంతో దేశం నలుమూలల నుంచి వచ్చిన సాధువులు, స్వామిజీలు షోడశి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కృష్ణానంద పురి స్వామిజీ శివైక్యం చెంది 16 రోజులు కావడంతో ఆదివారం అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో షోడశి పూజా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణ, అమ్మవారికి పూజలు, పురాణ పఠనాలు చేశారు. వాసవీ శాంతి ధాంలో కృష్ణానంద పురి స్వామిజీ భక్తులకు అందించిన ప్రవచనాలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గోవిందరాజులుతో పాటు, పలు ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు కమలానంద భారతీ స్వామి, కరకట్ట మాతా శివ చైతన్య, పెదపులిపాక వాసుదేవానంద గిరి, ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతిలతో పాటు మరో 24 మంది క్షేత్రాలకు చెందిన పీఠాధిపతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చొరవతో పాఠశాల అభివృద్ధి


1988-89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఉండి: పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన దేవాలయం అయిన పాఠశాల అభివృద్ధికి నడుం బిగించారు. 1988-89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, రాష్ట్ర జానపద, సృజనాత్మక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, హెచ్‌ఎం సాయిరాం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మా బ్యాచ్ ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో 2011లో తామంతా గెట్‌టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆనాటినుంచి పాఠశాల 100సంవత్సరాల పండుగ నిర్వహించిన సమయంలోనూ, పాఠశాల గ్రౌండ్ పూడిక సమయంలోనూ సహకారమందించామన్నారు. పాఠశాలలో ఇంటర్ తరగతులు ప్రారంభిస్తున్న దృష్ట్యా ఫిజిక్స్ ల్యాబ్లో 24 ఫ్యాన్లు అందించామన్నారు. ఈ విధంగా ఇప్పటి వరకు పాఠశాల అభివృద్ధికి 1988-89 బ్యాచ్ విద్యార్థులు సుమారుగా రూ.4 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. అనంతరం పాఠశాల గోడకు విద్యార్థులు చేపట్టిన అభివృద్ధి పనులు, తదితర వివరాలతో శిలా పలకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముదునూరి బంగార్రాజు, ఇందుకూరి శారద, వీరమల్లు మల్లేశ్వరరావు, కర్రి శ్రీను, కొమ్మన రాఘవ, ముంగండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

ప్రైవేటీకరణ, ఉద్యోగ వ్యతిరేక చర్యలపై పోరాటం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలో ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు, ప్రైవేటీకరణ ప్రయత్నాలపై బ్యాంకు యూనియన్లు పోరాడతామని నాయకులు ప్రకటించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ 64వ ఆవిర్భావ సభ ఆదివారం పట్టణంలోని షిర్డిసాయి కల్యాణ మండపంలో నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శీలా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు దూసనపూడి సోమసుందర్, ఎస్‌బీఐ అధికారుల సమాఖ్య జోనల్ కార్యదర్శి జవహర్, ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం సీనియర్ నాయకులు జి.బాపయ్య శర్మ, ప్రధాన కార్యదర్శి టీవీ సూర్యనారాయణ, సీనియర్ నాయకులు ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడారు. తొలుత స్టాఫ్ యూనియన్ వ్యవస్థాపకులు జీజీకే మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్యాంక్ ఎంప్లాయీస్ పాల్గొన్నారు.

బెదిరింపు కేసు నమోదు

ఆకివీడు: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని అడిగినందుకు చంపుతానని బెదిరించి, బూతులు తిట్టినట్లు స్థానిక పల్లె వీధికి చెందిన కొవ్వూరి కృష్ణవేణి ఫిర్యాదు చేసిందని, ఎస్సై బి.నాగబాబు ఆదివారం తెలిపారు. తనకు రావలసిన డబ్బులు అడిగినందుకు ఈ నెల 9న స్థానిక పెదపల్లి వీధికి చెందిన చుక్క లక్ష్మీ, వెంకటేశ్వరరావు, అమ్ములేశ్వరి, దుర్గారావు, నరగాని సుష్మాలు తన ఇంటి వద్దకు వచ్చి బూతులు తిడుతూ చంపేస్తామని బెదిరించారని ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాఠశాల పూర్వ విద్యార్థులు

భీమవరం : స్థానిక పొట్టి శ్రీరాములు పురపాలక బాలికోన్నత పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. 1994–95 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఒకటై సందడి చేసుకున్నారు. ఆనాడు చదువు చెప్పిన గురువులకు అభినంద సత్కారాలు నిర్వహించారు. ఈనాటి బంధం ఏనాటిదో అని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరికి ఒకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

అందలమెక్కిన అరటి పండు

- విపరీతంగా పెరిగిన ధరలు
- డజను రూ.100



ఆకివీడు: అరటి పండ్ల ధర భారీగా పెరిగింది. సాధారణంగా పండుగ సీజన్లలోనూ, పెళ్లిళ్ల సీజన్‌లో వీటి ధర తారాస్థాయికి చేరుతుంటుంది. అయితే సాధారణ రోజుల్లో అరటి పండ్లు కొనే వారు తక్కువగా ఉంటారు. దీంతో అరటి పండ్లు తక్కువ ధరకు అమ్ముకుంటుంటారు. అరటి పండ్ల దిగుబడి పడిపోవడంతో పండ్ల ధరలు భారీగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో డజను అరటి పండ్లు రూ.100 పలుకుతుంది. ప్రకృతి వైపరీత్యాలకు అరటి తోటలు ధ్వంసం కావడంతో దిగుబడి తగ్గిపోయిందంటున్నారు. మహానంది ప్రాంతం నుంచి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం, కొవ్వూరు, తదితర ప్రాంతాల నుంచి అరటి పండ్లు కొనుగోలు చేసి స్థానిక మార్కెట్లలో అమ్ముతున్నారు. ఇటీవల అరటి పండ్లలో నాణ్యత లోపించడం కూడా ధరలు పెరగడానికి కారణమంటున్నారు. తయారైన అరటి పండు పగిలిపోతుంది. ఈ విధంగా గెలలోని అత్యధిక హస్తాలలో పగిలిన పండ్లు ఉంటున్నాయి. దీనివల్ల వ్యాపారులకు నష్టం వాటిల్లడంతో, అరటి పండ్లు విడిగా విక్రయించే సమయంలో అధిక ధరలకు అమ్ముకోవలసి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు.